సాక్షి గుంటూరు

మంగళవారం ı 16 ı జూలై ı 2024



భక్తులకు రక్షణ కల్పించాలి

వినుకొండ(నూజెండ్ల): తొలి ఏకాదశి సందర్భంగా వినుకొండ రామలింగేశ్వరస్వామి తిరునాళ్లకు వచ్చే భక్తులకు రక్షణ కల్పించాలని ఏఎస్పీ లక్ష్మీపతి సోమవారం సిబ్బందికి సూచించారు.



భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

బెల్లంకొండ: బెల్లంకొండలో సోమవారం పీర్లను వైభవంగా ఊరేగించారు. మండలంలోని పాపాయపాలెం, బెల్లంకొండ, వన్నాయపాలెం తదితర గ్రామాల్లో ఊరేగింపు చేశారు.

విజయవారాహి అలంకారంలో బండ్లమ్మ



పిట్టలవానిపాలెం: చందోలులో వేంచేసి ఉన్న బగళాముఖ బండ్లమ్మ వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని విజయవారాహిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

భ్రమరాంబకు ఆషాఢ సారె



పెదకాకాని: శివాలయంలో కొలువుదీరిన భ్రమరాంబ అమ్మకు పెదకాకాని గ్రామానికి చెందిన వీరిశెట్టి లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు సోమవారం ఆషాఢసారె సమర్పించారు. లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు ఆలయ ఉప కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు, ఆలయ స్థానాచార్యులు పొత్తూరు సాంబశివరావు అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణల అనంతరం భ్రమరాంబ అమ్మవారికి చీర, పసుపు కుంకుమ, వివిధ రకాల పండ్లు, పూజా సామగ్రితో లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు సారె సమర్పించారు. ప్రత్యేక పూజలు జరిపించారు.

యార్డుకు 29,930 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 29,930 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 26,747 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.18,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.10,500 నుంచి రూ.17,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.9,000 నుంచి రూ.18,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,000 వరకు పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 15,530 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 3,115 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 0 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 264 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 43 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 87 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 198 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 1080 క్యూసెక్కులు విడుదల చేశారు.

కిడ్నీ రాకెట్ కేసులో పురోగతి

పోలీసుల అదుపులో ఇద్దరు

గుంటూరు ఈస్ట్ : కిడ్నీ రాకెట్ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఇటీవల ఐదుగురు నిందితులపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారిలో ఇరువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ప్రధాన నిందితుల్లో ఇరువురిని గోప్యంగా విచారణ చేస్తున్నట్లు తెలిసింది. కేవీపీ కాలనీకి చెందిన మధుబాబు తన కిడ్నీ తీసుకుని, ఒప్పందం ప్రకారం డబ్బులు చెల్లించలేదని ఇటీవల ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన సంగతి విదితమే. దీనిపై సీరియస్‌గా తీసుకున్న పోలీసులు నిందితులను పట్టుకునేందుకు మూడు బృందాలను నియమించారు. వారు విస్తృతంగా గాలింపు చేస్తున్నారు.

పెన్సిల్ మొనలపై నెల్సన్ మండేలా జీవిత చరిత్ర

స్వర్ణ సూక్ష్మ కళాకారిణి మహిత ప్రతిభ





స్వర్ణ(కారంచేడు): దక్షిణాఫ్రికా కాంతి కిరణం, నోబెల్ శాంతి బహుమతి అవార్డు గ్రహీత నెల్సన్ మండేలా జీవిత చరిత్రను బాపట్ల జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన అన్నం మహిత పెన్సిల్ మొనలపై రాసి అందరినీ అబ్బురపరచింది. ఈమె కొంత మంది మహానుభావుల జీవిత చరిత్రలను పెన్సిల్ మొనలపై చెక్కుతూ శభాష్ అనిపించుకుంటోంది. ఆమె తయారు చేసిన నెల్సన్‌మండేలా జీవిత చరిత్ర ఫ్రేమ్‌ను ఈనెల 18వ తేదీన ఆయన జయంతిని పురస్కరించుకొని దక్షిణాఫ్రికాకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నట్లు మహిత తల్లిదండ్రులు అన్నం నరసింహారావు, భ్రమరాంబ తెలిపారు.

భృతి సంగతేంటి!

కళ్లల్లో ఒత్తులేసుకుని ఎదురు చూస్తున్న నిరుద్యోగుల ఆశలు ఫలిస్తాయా? ఇంటికో ఉద్యోగం వస్తుందా? అప్పటివరకు నిరుద్యోగ భృతి అయినా దక్కుతుందా? లేదా గతంలోలా ఆశాభంగమవుతుందా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పాలకపగ్గాలు చేపట్టి నెల రోజులవుతున్నా.. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల సం'గతేమిటో' పెదవి విప్పడం లేదు. కనీసం విధివిధానాల రూపకల్పనకూ కసరత్తు ప్రారంభించిన పాపాన పోలేదు.

- నెలైనా పెదవి విప్పరేం!
- గతంలోలాగానే మోసం చేస్తారా?
- నిరుద్యోగుల్లో సందేహాలు
- ఇంటికి ఒక ఉద్యోగం.. లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామన్న చంద్రబాబు
- జిల్లాలో 5.58 లక్షల కుటుంబాలు

నిరుద్యోగ భృతి కోసం యువత ఎదురుచూపులు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: ''యువతను ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అనుసంధానం చేస్తాం. పరిశ్రమలు తెస్తాం. సంపద సృష్టించి అభివృద్ధి చేస్తాం. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటికొకరికి ఉద్యోగం ఇస్తాం. లేదంటే రూ.3 వేలు భృతి ఇస్తాం.'' అంటూ ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి నేతలు, ముఖ్యంగా తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు ఊదరగొట్టారు. గుంటూరు జిల్లాలో జరిగిన ప్రచార సభల్లోనూ ఈ విషయాన్ని పదేపదే వల్లెవేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలరోజులైనా ఇప్పటివరకు దీనిపై కార్యాచరణ లేదు. ఈ నేపథ్యంలో పదో తరగతి, ఆపై చదువుకున్న ప్రతిఒక్కరికీ రూ.3వేల నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందేనన్న డిమాండ్ జిల్లాలో వ్యక్తమవుతోంది.

దగా డీఎస్సీ ఆమోదంతో సరి!

గుంటూరు జిల్లాలో ఐదు లక్షల 58 వేల కుటుంబాలు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నాయి. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, ఇంజినీరింగ్, పీజీ ఇలా ఏదో ఒకటి పూర్తిచేసిన వారు ప్రతి కుటుంబంలో ఒకరు ఉన్నారు. ఈ లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే నాలుగు లక్షలపైబడి నిరుద్యోగులు జిల్లాలో ఉన్నారని అంచనా. ఇందులో కనీసం నాలుగు లక్షల మంది యువతకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలలో ఉద్యోగాలు కల్పించాల్సి ఉంది. కొత్త ప్రభుత్వం వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ పేరుతో కేవలం 16 వేల టీచర్ పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. అదీ డిసెంబర్ వరకు భర్తీ ప్రక్రియ కొనసాగుతుందని సన్నాయి నొక్కులు నొక్కింది. ఈ పోస్టుల్లో జిల్లాకు వెయ్యి కూడా వచ్చే అవకాశం లేకపోవడంతో ఇది దగా డీఎస్సీ అని నిరుద్యోగులు పెదవి విరుస్తున్నారు.

త్రిశంకు స్వర్గంలో వలంటీర్ వ్యవస్థ

కొత్త ప్రభుత్వం వచ్చాక ఉన్న ఉపాధి అవకాశాలకు కోత పెడుతోంది. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను త్రిశంకు స్వర్గంలో పెట్టింది. వారిని కొనసాగిస్తామని, రూ.5 వేలుగా ఉన్న పారితోషికాన్ని రూ.పది వేలు చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చినా అమలు దిశగా అడుగులు పడడం లేదు.

గత ప్రభుత్వంలో ఉద్యోగాల విప్లవం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జిల్లాలో ఉద్యోగాల విప్లవం వచ్చింది. 262 గ్రామ సచివాలయాలు, 306 వార్డు సచివాలయాల ద్వారా 5,680 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా మరో ఐదు వందల మందికి ఉపాధి దొరికింది. చాలా మంది సొంత గ్రామాలు, సొంత మండలాల్లో ఉపాధి పొందారు. అప్పట్లో హైదరాబాద్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న వారు సొంత ప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందడం గమనార్హం. ఇంత పెద్ద ఎత్తున ఒకేసారి ప్రభుత్వ ఉద్యోగాల కల్పన గతంలో ఎన్నడూ జరిగిన దాఖలాలు లేవు. జిల్లాలో సుమారు పది వేల మందికిపైగా వలంటీర్లుగా సొంత గ్రామంలో ఉపాధి పొందారు. సంక్షేమ పథకాల అమలులో, ఇతర సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని అందరి చేత శభాష్ అనిపించుకున్నారు.

ఇచ్చిన హామీ అమలు చేయాలి

ఎన్నికల ముందు కూటమి నేతలు ప్రతి సభలోనూ నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పెదవి విప్పడం లేదు. హామీని అమలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి. వెంటనే విధివిధానాలు ప్రకటించాలి.

– షేక్ జానీబాషా, పొన్నూరు

వైఎస్ జగన్ హయాంలో జిల్లాలో ఉద్యోగాల కల్పన ఇలా..

విభాగం	ఇచ్చిన ఉద్యోగాలు /కల్పించిన ఉపాధి
గ్రామ/వార్డు సచివాలయాలు :	5,680
రైతు భరోసా కేంద్రాలు :	500
వలంటీర్ వ్యవస్థ :	10,000
వైద్య, ఆరోగ్యశాఖ :	2,000కుపైగా

(ఇవి కాక, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు వేలాది మందికి ఇచ్చారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాల్లోనూ భారీ ఎత్తున ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పించారు.)

- గత ప్రభుత్వంలో వైద్య ఆరోగ్య శాఖలో రెండు వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ అయ్యాయి. ఇతర శాఖల్లో శాశ్వత, కాంట్రాక్టు పోస్టులు భర్తీ అయ్యాయి.
- అప్కాస్ పేరిట వేలాది మందికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు వచ్చాయి.
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాల్లో ప్రఖ్యాత ప్రైవేటు సంస్థల్లో పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించారు.

2014–19 మధ్య కూడా ద్రోహం

2014 ఎన్నికల్లోనూ జాబ్ రావాలంటే బాబు రావాలి అంటూ ఊదరగొట్టి నిరుద్యోగ భృతి హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మాట తప్పారు. నిరుద్యోగ యువతను దారుణంగా మోసం చేశారు. భృతి పేరిట ఆఖరి రెండేళ్ల బడ్జెట్ కేటాయింపులు చేసినా సరిగా అమలు చేయలేదు. ఇప్పుడూ అలాగే మోసం చేస్తారేమోనని యువత ఆందోళన చెందుతోంది. వెంటనే పది, ఆపై చదువు పూర్తిచేసిన అందరికీ నిరుద్యోగ భృతి ప్రకటించాలని విద్యార్థి, యువజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మాట నిలబెట్టుకోవాలి



ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించారు. నెలైనా దీనిపై ఆయన పెదవి విప్పలేదు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

– షేక్ ఫజల్, పొన్నూరు

మార్గదర్శకాలు విడుదల చేయాలి



నిరుద్యోగ భృతికి సంబంధించిన మార్గదర్శకాలను వెంటనే విడుదల చేసి, విద్యావంతులైన నిరుద్యోగులందరికీ భృతి మంజూరు చేయాలి. ప్రభుత్వ ఉద్యోగాలకు, పోటీ పరీక్షలకు ఏళ్ల తరబడి సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువకులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోచింగ్‌కు వేలాది రూపాయల ఫీజులు చెల్లించిన యువతను నిరుద్యోగ భృతితో ఆదుకోవాలి.

– కేవీ సుబ్రహ్మణ్యం, నిరుద్యోగ ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్, గుంటూరు

వెంటనే హామీ అమలు చేయాలి



2021లో నేను సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశా. ప్రభుత్వ ఉద్యోగావకాశం కోసం పోటీ పరీక్షలకు తయారవుతున్నా. పోస్టుల దరఖాస్తుకు, కోచింగ్‌కు ఇబ్బంది పడుతున్నా. చంద్రబాబు హామీ ఇచ్చినట్టు నెలనెలా నిరుద్యోగ భృతి ఇవ్వాలి. వెంటనే హామీని అమలు చేయాలి.

– కారుమూరి రవితేజ, మల్లెపాడు

ఎదురుచూస్తున్నా



నేను డిగ్రీ చదివా. ఎలాంటి ఉద్యోగం లేదు. ఖాళీగా ఉండలేక కూలిపనులకు వెళ్తున్నా. ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చినట్టు ఉద్యోగమైనా ఇవ్వాలి, లేక భృతి అయినా ఇవ్వాలి. ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలి. ఆశగా ఎదురు చూస్తున్నాం. పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన ప్రతిఒక్కరికీ ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– కట్టా రాఘవేంద్రరావు, దావులూరు, నిరుద్యోగి

పెండింగ్ లేకుండా అర్జీలు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరువెస్ట్: వివిధ సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు సత్వర న్యాయం చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఫిర్యాదులు వారంలోపే పరిష్కరించాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన అర్జీ అయితే ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల పనివేళల్లో సిబ్బంది విధిగా ఉండాలన్నారు. జిల్లాలోని ఐదు రీచ్‌ల ద్వారా ఇసుక సరఫరా జరుగుతుందన్నారు. టన్నుకు రూ.250 సాధారణ ఖర్చుల కింద ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఇసుక అక్రమార్కుల పాలు కాకుండా చూడాలని, ప్రజలకు సజావుగా అందేలా పని చేయాలన్నారు. ఇసుక సరఫరాకు సంబంధించి వచ్చే ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించడంతోపాటు తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం వచ్చిన 230 ఫిర్యాదులను కలెక్టర్, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా అధికారులు పరిశీలించారు.

యానిమేటర్లపై వేధింపులు తగవు

గ్రామాల్లో స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేసి వారు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్న యానిమేటర్లపై రాజకీయ ముద్ర వేసి వేధింపులు చేయడం తగదు. దాదాపు 20 ఏళ్ల నుంచి చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నాం. మాపై రాజకీయ ముద్రవేసి కక్ష సాధిస్తున్నారు. కాపాడండి.

–వెలుగు యానిమేటర్ల ఉద్యోగ సంఘం నాయకులు

తెలుగు పాఠాలు చెప్పడంలేదు

మేము తెనాలి మండలం పెదరావూరు గ్రామ జెడ్పీ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాం. అక్కడ తెలుగు పాఠాలు సరిగ్గా చెప్పడంలేదు. హెడ్ మాస్టర్‌కు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు. పరీక్షల సమయంలో తీవ్ర ఇబ్బందిగా ఉంది. మాకు న్యాయం చేయండి.

– ఫాతిమా, తదితరులు

అట్టహాసంగా జగన్నాథ రథయాత్ర



గుంటూరు వీధుల్లో సాగుతున్న జగన్నాథ రథయాత్ర

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు నగర వీధుల్లో జగన్నాథ రథయాత్ర అట్టహాసంగా జరిగింది. రహదారుల వెంట బారులు తీరిన భక్తులు రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. జై జగన్నాథ నినాదాలతో వీధులు మార్మోగాయి. గుంటూరు మల్లారెడ్డినగర్‌లోని ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం హిందూ కళాశాల కూడలిలో యాత్ర ప్రారంభమైంది. గుంటూరు పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్ కొబ్బరి కాయ కొట్టి యాత్రను ప్రారంభించారు. జిన్నాటవర్ సెంటర్, శ్రీవిజయటాకీస్, నాజ్ కూడలి, ఏసీ కళాశాల, అరండల్‌పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి, బ్రాడిపేట, లక్ష్మీపురం, బృందావన్ గార్డెన్స్ మీదుగా పట్టాభిపురం, కంకరగుంట ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా ఏటీ అగ్రహారం జీరో వీధి నుంచి మల్లారెడ్డినగర్ వరకు యాత్ర సాగింది. అనంతరం మల్లారెడ్డినగర్‌లోని ఇస్కాన్ మందిరంలో ప్రవచనాలు, జగన్నాథుని లీలలను వక్తలు వివరించారు. ఇస్కాన్ భక్త బృందం సంకీర్తనలు, భజనలు, నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం భారీ అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఇస్కాన్ మందిర అధ్యక్షుడు పుండరీకాక్ష గోవింద్ ప్రభు, మందిర సహ అధ్యక్షులు దయానిధి ప్రభు, అయ్యప్ప స్వామి దేవాలయం, ఎంకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి, రేమాండ్ షోరూం నిర్వాహకులు అరుణ్, శ్రీకాంతగోవిందదేవదాసు తదితరులు పాల్గొన్నారు.



రథంపై కొలువుదీరిన జగన్నాథస్వామి

భక్తులకు సౌకర్యాల కల్పనలో రాజీవద్దు



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- పల్నాడు కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- కోటప్పకొండపై తొలిఏకాదశి వేడుకలపై ఎమ్మెల్యే చదలవాడతో కలిసి సమీక్ష

నరసరావుపేట: తొలి ఏకాదశి సందర్భంగా కోటప్పకొండకు వేలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబుతో కలిసి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏకాదశి సందర్భంగా గిరి ప్రదక్షిణ చేసే భక్తుల కోసం ప్రదక్షిణ మార్గం చదును చేయాలన్నారు. మార్గం ఆద్యంతం తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. కొండ పైనా, కింద అంబులెన్సులు సిద్ధంగా ఉంచుకోవాలని, అవసరమైన చోట మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా పాము కాటు మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ట్రాక్టర్లు, ఆటోలలో పరిమితికి లోబడి మాత్రమే ప్రయాణికులను అనుమతించాలన్నారు. భక్తుల అవసరం మేరకు బస్సులు నడపాలని, బస్సులు నడిచే వేళలపై ప్రచారం కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే చదలవాడ మాట్లాడుతూ ఆలయ ప్రసాదంలో నాణ్యత పాటించాలని, భక్తులకు వీలైనంత త్వరగా, ప్రశాంత వాతావరణంలో స్వామి దర్శనభాగ్యం కలిగేలా చూడాలని అధికారులను కోరారు. జిల్లా అటవీ అధికారి రామచంద్రరావు, ఆర్డీఓ శ్రీదేవి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.15 కోట్లతో ఔషధ వ్యాపారి పరారీ

నరసరావుపేట టౌన్: హోల్‌సేల్ ఔషధ వ్యాపారి రూ.15 కోట్లతో ఉడాయించిన సంఘటన పట్టణంలో కలకలం రేపింది. అప్పులిచ్చిన బాధితులు సోమవారం వ్యాపారి ఇంటి వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. కుటుంబంతో సహా నాలుగు రోజుల కిందటే ఊరు విడిచి వెళ్లినట్లు తెలుసుకొని బాధి తులు ఆందోళన చేశారు. వివరాలలోకి వెళితే.. విద్యుత్ కార్యాలయం వెనుక ప్రాంతంలోని అలవాల బజార్‌లో నివాసం ఉంటున్న ఔషధ వ్యాపారి కోట సెంటర్‌లో 15 ఏళ్లుగా హోల్‌సేల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. వ్యాపారం బాగా చేస్తూ తీసుకున్న అప్పులకు సకాలంలో వడ్డీలు చెల్లిస్తుండటంతో నమ్మిన వడ్డీ వ్యాపారులు, స్నేహితులు అధిక మొత్తంలో డబ్బులు వడ్డీకి ఇచ్చారు. 20 రోజుల కిందట దుకాణంలో ఉన్న స్టాక్ మొత్తాన్ని రూ.5 కోట్లకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. దీంతోపాటు చీటీపాటలు పాడి నగదు కూడబెట్టుకున్నాడు. నాలుగు రోజుల కిందట కుటుంబ సభ్యులతో సహా ఇంటికి తాళాలు వేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతని ఫోన్ స్విచ్ ఆఫ్ రావటంతో వడ్డీ వ్యాపారులు ఆరా తీశారు. దీంతో అసలు విషయం బయటపడింది. వ్యాపారి ఇంటివద్దకు పెద్ద సంఖ్యలో బాధితులు వచ్చారన్న విషయం తెలుసుకున్న ఓ బ్యాంక్ ప్రతినిధులు ఇల్లు తమ బ్యాంక్ తాకట్టులో ఉందని నోటీసు అంటించారు. ఇంటిని తనఖా పెట్టి సుమారు రూ.3 కోట్ల వరకు అప్పు తీసుకున్నట్లు సమాచారం.

చిన్నారిపై లైంగికదాడి, హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): నాలుగేళ్ల చిన్నారిపై లైంగికదాడికి పాల్పడి, అనంతరం హత్య చేసిన వ్యక్తికి జీవితకాల శిక్ష, రూ.21 వేలు జరిమానా విధిస్తూ గుంటూరు ఐదో అదనపు జిల్లా జడ్జి, పోక్సో కోర్టు ఇన్‌చార్జి జడ్జి కె.నీలిమ సోమవారం తీర్పు చెప్పారు. 2018లో మాచర్ల కొత్తూరులో నాలుగేళ్ల చిన్నారిని అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి బిస్కెట్లు ఇప్పిస్తానని నమ్మబలికి పేరమ్మ స్థలం వద్దకు తీసుకెళ్లారు. అనంతరం చిన్నారిపై లైంగికదాడి చేసి హత్యకు పాల్పడ్డాడు. ఈలోగా కుమార్తె కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు పరిసర ప్రాంతాల్లో వెదికారు. వారితోపాటు లైంగికదాడి, హత్యకు పాల్పడిన వ్యక్తి ఏమి తెలియనట్లు వెదకడం ప్రారంభించాడు. ఈలోగా పాప హత్యకు గురైనట్టు బయటపడటంతో నిందితుడు పరారయ్యాడు. కుమార్తె హత్యపై కుటుంబ సభ్యులు నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయగా, గురజాల డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీనిపై చార్జిషీట్ దాఖలు చేయగా అతన్ని అరెస్ట్ చేశారు. ఈ కేసులో సాక్ష్యాలు రుజువుకావడంతో నిందితుడికి జీవిత కాల శిక్ష, రూ.21 వేలు జరిమానా విధిస్తూ సోమవారం గుంటూరు జిల్లాలోని ఐదో అదనపు జిల్లా జడ్జి, పోక్సో కోర్టు ఇన్‌చార్జి జడ్జి కె.నీలిమ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్యామల కేసు వాదించారు.

యూపీహెచ్‌సీని పరిశీలించిన కేంద్ర బృందం



తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణం గణపతిరావునగర్‌లోని ఇందిరానగర్‌లో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను సోమవారం భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి అపూర్వచంద్ర పరిశీలించారు. రాష్ట్రంలో ఎన్క్వాస్ సర్టిఫికెట్ పొందిన హెల్త్ సెంటర్‌లో నాణ్యతా ప్రమాణాలు ఏ విధంగా అమలు చేస్తున్నారో పరిశీలించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఇందిరానగర్ యూపీహెచ్‌సీ రాష్ట్రంలో తొలి ఎన్క్వాస్ సర్టిఫికెట్ పొందిందని తెలిపారు. గత ఏడాది హెల్త్ సెంటర్ నాణ్యత ప్రమాణాలలో 12 విభాగాలకు సంబంధించిన ఎన్క్వాస్ సర్టిఫికెట్ పొందిందని తెలిపారు. భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి అపూర్వచంద్ర సందర్శించి నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, నేషనల్ హెల్త్ మిషన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి, స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి, డీపీఎంఓ డాక్టర్ రత్నం మన్మోహన్, డీపీఓ సైమన్, స్టేట్ కన్సల్టెంట్ వేణు, హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎ.శ్రీమన్నారాయణ, హెల్త్ సెంటర్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, హెల్త్‌సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

- పోలీస్ గ్రీవెన్స్‌లో బాధితుల వినతి
- ఫిర్యాదులు స్వీకరించిన ఏఎస్పీలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని పలువురు బాధితులు పోలీసులను వేడుకున్నారు. గుంటూరు నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. బాధితుల ఫిర్యాదులను ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), శ్రీనివాసరావు (క్రైం) స్వీకరించారు. ఫిర్యాదులను సంబంధిత పోలీస్‌స్టేషన్లకు పంపి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు మహేష్ (గుంటూరు పశ్చిమ), మహబూబ్‌బాషా (దక్షిణ) ఫిర్యాదులు స్వీకరించారు.



బాధితుల సమస్య ఆలకిస్తున్న ఏఎస్పీ రమణమూర్తి

గంజాయి మత్తులో ఆకతాయిల గొడవ

స్వర్ణభారతినగర్, పరిసర ప్రాంతాల్లో ఆకతాయిల అల్లరి ఎక్కువైంది. పలువురు యువకులు మద్యం, గంజాయి మత్తులో వీరంగం సృష్టిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా వచ్చేపోయే మహిళలు, యువతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆ దారిన వెళ్లే మహిళల మెడల్లో బంగారు గొలుసులు తెంచుకెళ్తున్నారు. నగదు లాగేసుకుంటున్నారు. దీనిపై గతంలో నల్లపాడు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. పోలీసుల గస్తీని పెంచగలరు.

– స్థానికులు, స్వర్ణభారతి నగర్

రూ.9 లక్షలు చెల్లించాల్సి ఉంది

జేకేసీ కళాశాల రోడ్ విజయపురి కాలనీలోని ఓ కంపెనీ వ్యాపారికి 2022లో మిర్చి అప్పగించాం. అప్పటి నుంచి కాలయాపన చేయగా, సదరు వ్యక్తి గతనెలలో మరణించినట్లు తెలిసింది. మా ఇద్దరికీ కంపెనీ నుంచి రూ.9 లక్షలు రావాల్సి ఉంది. కంపెనీకి సంబంధించి కుటుంబ సభ్యులను అడిగితే దుర్భాషలాడుతున్నారు. ఆ వ్యక్తులను పిలిచి, మాకు న్యాయం చేయగలరు.

– కిలారు రాజారమేష్, అప్పసాని చంద్రశేఖర్, తక్కెళ్ళపాడు, పెదకాకాని మండలం

కంబోడియాలో ఉద్యోగాల పేరిట దగా

ఇటీవల తెనాలికి చెందిన ఓ వ్యక్తి పరిచయమై, కంబోడియాలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నానని చెప్పారు. నా ఇద్దరు పిల్లలకు కంబోడియాలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటే రూ.1.20 లక్షలు ఫోన్‌పే చేశాం. దీంతో ఫిబ్రవరి 19న కోల్‌కతా నుంచి కంబోడియా వెళ్లగా, దేశంలోకి అనుమతించలేదు. దీంతో ఇద్దరు పిల్లలు వెనుదిరిగి వచ్చేశారు. మరోసారి పంపిస్తానని చెప్పడంతో మళ్లీ రూ.1.20 లక్షలు చెల్లించగా, ఈ ఏడాది మార్చి 14న వెళ్లారు. ఓ ప్రైవేటు కంపెనీలో ఏడాదిపాటు వెట్టిచాకిరి చేయాలని, బలవంతంగా సంతకాలు చేయాలని ఒత్తిడి తేగా నిరాకరించారు. పిల్లల పాస్‌పోర్ట్‌లు తీసేసుకున్నారు. కష్టం మీద కంబోడియా నుంచి స్వస్థలానికి వచ్చారు. పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసగించిన వ్యక్తిని విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతున్నా.

– సాతా వీరశంకరరావు, చెంచుపేట, తెనాలి

మోసం చేసింది కాక ఎదురు కేసు

ఆర్ అగ్రహారంలోని తెలిసిన వ్యక్తి ద్వారా ఎనిమిదేళ్ల క్రితం పొన్నూరు వాసి పరిచయమయ్యారు. అప్పటి అదనపు డీజీ, మరో ఐపీఎస్ అధికారిణి వరుసకు బంధువులమని చెప్పారు. రెండో కుమార్తె శివ పార్వతికి మున్సిపాలిటీలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించారు. రూ.2.85 లక్షలు తీసుకున్నారు. అనంతరం ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో విజయవాడలో రెండు సార్లు ఫిర్యాదు చేయగా, డబ్బులు చెల్లిస్తామని 2018లో హామీపత్రం రాసిచ్చారు. ఆ వ్యక్తి మాపై కక్ష పెంచుకుని తప్పుడు ఫిర్యాదులు చేశామని ఎదురు మాపైనే గుంటూరులో కేసు పెట్టారు. మా ఇంటిపైకి వచ్చి కుటుంబ సభ్యులను చిత్రహింసలకు గురిచేశారు. బీరువాలో దాచిన రూ.2 లక్షలు, బంగారం ఎత్తుకెళ్లారు. అతడు పెట్టిన కేసు ఆధారంగా పోలీసులు నా అల్లుడ్ని, నన్ను అరెస్ట్ చేశారు. అల్లుడిని రిమాండ్‌కు పంపారు. నన్ను పూచీకత్తుపై విడుదల చేశారు. దీనిపై అప్పటి రేంజ్ ఐజీ, ఎస్పీకి ఫిర్యాదు చేయగా విచారణ జరిపి మా పేర్లను తొలగించారు. మాపై తప్పుడు కేసు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి.

– కేఎస్ మల్లేశ్వరరావు, విశ్రాంత ఏఎస్ఐ, విజయవాడ

టీడీపీ నేత మాట తప్పారు

గతనెల 17న టీడీపీ నేత పుట్టిన రోజు కావడంతో నల్లచెరువు 10వ వీధిలో డీజే ఏర్పాటు చేశారు. దీంతో అందరి పిల్లలతోపాటు మా పదేళ్ల కుమారుడు షేక్ మస్తాన్‌షరీఫ్ వెళ్లాడు. బాణసంచా కాల్చే సమయంలో నా కుమారుడితోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మెరుగైన వైద్యసేవల నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా, 12 రోజుల క్రితం డిశ్చార్జ్ చేశారు. ప్రస్తుతం ఇంట్లో ఉంటున్నాడు. దీనిపై లాలాపేట పీఎస్‌లో కేసు నమోదైంది. గాయాలైన సమయంలో టీడీపీ నేత, మరో వ్యక్తి చికిత్స చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత చికిత్సకు నిరాకరించారు. దీనిపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదు. నా కుమారుడికి న్యాయం చేయాలి.

– అమ్మమ్మ షేక్.జానమ్మ, నల్లచెరువు.

కుష్టు వ్యాధి నిర్మూలన సామాజిక బాధ్యత

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, డీఆర్వో పెద్ది రోజా, డీఎంహెచ్ఓ విజయలక్ష్మి

గుంటూరు వెస్ట్: ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని, దీన్లో భాగంగా కుష్టు వ్యాధి నిర్మూలనను సామాజిక బాధ్యతగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18 నుంచి వచ్చే నెల 2 వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. కుష్టు వ్యాధి నిర్మూలించే రోగమన్నారు. దీని బారిన పడ్డ బాధితులు ఆందోళన చెందాల్సిన పనిలేదని పేర్కొన్నారు. ఇప్పుడు ఎన్నో ఆధునిక మందులు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. క్రమం తప్పకుండా ఎండిటి (మల్టీ డ్రగ్ థెరపి) మందును వేసుకోవాలన్నారు. వీటిని ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇస్తున్నారని చెప్పారు. కుష్టు వ్యాధి అనుమానిత లక్షణాలైన చర్మంపై స్పర్శలేకపోవడం, మచ్చలు, కనుబొమ్మలు, కనురెప్పలు, వెంట్రుకలు రాలిపోవడంలాంటి లక్షణాలుంటే తక్షణం వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 6 నుంచి నిర్వహించిన సర్వేలో కొత్తగా 13 కేసులను గుర్తించామన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందించే సామాజిక పెన్షన్‌ను 322 ఇస్తున్నామని తెలిపారు. అనంతరం కలెక్టర్, అధికారులు కుష్టు వ్యాధిపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ డి.శ్రీనివాసులు, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గుంటూరు చానల్ పొడిగింపునకు నిధులు కేటాయించాలి

జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన రైతు సంఘ నాయకులు



మాట్లాడుతున్న రైతు సంఘ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, పక్కన రైతు సంఘ నాయకులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు చానల్ పొడిగింపునకు నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కుంచుమాటి అజయ్‌కుమార్ కోరారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని కలిసి రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రాంతంలో గుంటూరు చానల్‌ను పొడిగించాలని రైతు సంఘాల ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నా అమలులోకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 50 వేల ఎకరాలకు సాగునీరు, 50 గ్రామాలకు తాగునీరు లభించే ఈ కీలకమైన ప్రాజెక్టు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించటం తగదు అన్నారు. 2018లో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం చానల్ పొడిగింపుకు జీవో జారీ చేసిందని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని చానల్ పొడిగింపునకు నిధులు కేటాయించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, నాయకులు జంపని రామారావు, పోపూరి సుధీర్, నల్లమోతు రాజేంద్ర, ఇంటూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పందం ప్రకారం రైతుల ఖాతాల్లో రూ.7వేలు వేయాలి

పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ శివశంకరరావు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజి యాజమాన్యానికి, బాధిత పసుపు రైతులకు మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం రైతుల ఖాతాల్లో రూ.ఏడు వేలు వేయాలని పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు కోరారు. దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో పంటను భద్రపరుచుకుని నష్టపోయిన రైతుల సమావేశం సోమవారం దుగ్గిరాలలోని టర్మరిక్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శివశంకరరావు మాట్లాడుతూ 2024 జనవరి 19న దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజిలో దగ్ధమైన పసుపు రైతులకు క్వింటాకు రూ.12,500 ఇవ్వాలని వివిధ రూపాలలో అనేక ఆందోళనలు చేసిన ఫలితంగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు సమక్షంలో రైతు సంఘాల ప్రతినిధి బృందం, కోల్డ్ స్టోరేజ్ యాజమాన్య బృందం, మార్క్‌ఫెడ్ మార్కెట్ తెనాలి సబ్ కలెక్టర్ సమక్షంలో క్వింటాకు రూ.7 వేలు ఇవ్వడానికి అంగీకరించారని తెలిపారు. సొసైటీ లోన్స్, బ్యాంక్ లోన్స్ ఎత్తివేయాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం మద్దతు ధరలు చట్టరూపం తేవాలని, 2022-23, 2023-24 సంవత్సరాల్లో రబీ, ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన రైతులకు వెంటనే బీమా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పసుపు రైతు సంఘం కమిటీ సభ్యులు ములక శివసాంబిరెడ్డి, రైతు సంఘం నాయకులు అమ్మిరెడ్డి, వై.బ్రహ్మేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాలరాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం

- దుగ్గిరాలలో అత్యధికంగా 22.8 మి.మీ
- నగటున 5.4 మి.మీ వర్షపాతం

కొరిటిపాడు(గుంటూరు): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గుంటూరు జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చిరు జల్లులతో కూడిన వర్షం పడుతోంది. జిల్లాలో ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 22.8 మిల్లీ మీటర్ల వర్షం కురవగా, అత్యల్పంగా గుంటూరు తూర్పులో ఒక మి.మీ చొప్పున వర్షం పడింది. సగటున 5.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. పెదకాకాని మండలంలో 12 మి.మీ., చేబ్రోలు 8, తెనాలి 6.2, తాడేపల్లి 5.8, పొన్నూరు 5.6, మేడికొండూరు 5, పెదనందిపాడు 4.6, కొల్లిపర 4.4, ప్రత్తిపాడు 4, వట్టిచెరుకూరు 3.8, గుంటూరు పశ్చిమ 3.4, మంగళగిరి 3.4, తాడికొండ 2.2, కాకుమాను 1.8, ఫిరంగిపురం 1.8, తుళ్ళూరు మండలంలో 1.6 మి.మీ చొప్పున వర్షం పడింది. జూన్ 15వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 176.9 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 278.5 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాస్థాయి బ్యాడ్మింటన్‌లో విద్యార్థినికి ప్రథమ స్థానం



విద్యార్థిని అక్షరను అభినందిస్తున్న మల్లేశ్వరి, తల్లిదండ్రులు

గుంటూరు ఎడ్యుకేషన్: బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి చాంపియన్‌షిప్‌లో సుమేధ హైస్కూల్ విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎన్జీఓ కాలనీలోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 13, 14 తేదీల్లో తాడేపల్లిలో జరిగిన 51వ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండర్-11 బాలికల విభాగం సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ప్రథమ స్థానం సాధించిన సంకట సాయి అక్షరను అభినందించారు. జిల్లాస్థాయిలో అనేక మంది క్రీడాకారులతో పోటీపడిన తమ విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. విద్యతోపాటు ఆట, పాటలతో కూడిన విధానంతో విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మల్లేశ్వరి, హెచ్ఎం రాంబాబు, పీఈటీ కిరణ్‌రెడ్డి, విద్యార్థిని తల్లిదండ్రులు సంకటి దుశ్యంత్ రెడ్డి, ప్రశాంతి, తాతయ్య జయరామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థినిని అభినందించారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇసుక సరఫరా

కలెక్టర్ నాగలక్ష్మి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: స్టాక్ పాయింట్ల నుంచి ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఇసుక సరఫరా చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అధిక ధరలకు విక్రయించకుండా చూడాలన్నారు. దీని కోసం అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ సాగించాలన్నారు. అక్రమాలు గుర్తిస్తే కేసులు నమోదు చేసి, పెనాల్టీలు వేయాలన్నారు. ఇసుకపై వచ్చే ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రాయపూడి వద్ద పూడికతీతకు మైన్స్, జియాలజీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో 10 రోజుల్లో తనిఖీలు నిర్వహించి నివేదిక అందజేయాలన్నారు. దుగ్గిరాల మండలం పెదకొండూరులో సీజ్ చేసిన 5,003 మెట్రిక్ టన్నుల ఇసుకను స్టాక్ పాయింట్‌గా గుర్తించి విక్రయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక సరఫరా చేసే వాహనాలు రవాణా శాఖ నిర్దేశించిన ధరలనే వసూలు చేయాలన్నారు. ధరల వివరాలు ప్రతి స్టాక్ పాయింట్ వద్ద ఫ్లెక్సీల రూపంలో ఉంచాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి చంద్రశేఖర్, ఉప రవాణా శాఖ కమిషనర్ కరీం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ నారాయణ డీపీఓ శ్రీదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్మెల్‌మాత ఉత్సవాలు

ఫిరంగిపురం: కార్మెల్ కొండపై ఉన్న కార్మెల్ మాత ఉత్సవాలను సోమవారం రెండోరోజు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన దివ్యపూజాబలి కార్యక్రమంలో సాగర్ మాత పుణ్యక్షేత్రం ఫాదర్ పి.జోసఫ్ బాలసాగర్ వాక్యోపదేశం చేశారు. కార్మెల్ మాతను భక్తితో ప్రార్థిస్తే కష్టాలు తీరుతాయని చెప్పారు.

మొక్కులు తీర్చుకున్న భక్తులు

అనేక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. జోరున వర్షం పడుతున్నా కొండను ఎక్కి కార్మెల్ మాత ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలో కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.



కార్మెల్ మాత స్వరూపాన్ని ఊరేగిస్తున్న భక్తులు

నిత్యసహాయమాత

కార్మెల్ నిత్యసహాయమాత అని గుంటూరు జిల్లా మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. కార్మెల్ మాత కొండ వద్ద ఉత్సవాల సందర్భంగా కొండ దిగువన ఏర్పాటు చేసిన సమష్టి దివ్యపూజాబలి కార్యక్రమంలో ఆయన సోమవారం వాక్యోపదేశం చేశారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. ముందుగా బాల ఏసుదేవాలయం వద్ద నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో మరియ మాత స్వరూపాన్ని ఉంచి గ్రామంలో ఊరేగింపుగా కొండ వద్దకు తీసుకువచ్చారు. ఊరేగింపులో చిన్నాబత్తిని భాగ్యయ్య, బాల ఏసు దేవాలయ విచారణ గురువులు ఎం.ఫాతిమా మర్రెడ్డి, సహాయ విచారణ గురువులు బి.ప్రవీణ్‌కుమార్, మరికొందరు గురువులు దివ్యసత్‌ప్రసాదాన్ని చేతబూని ప్రార్థనా స్థలం వద్దకు వచ్చారు. కార్యక్రమంలో మఠకన్యలు, గుడిపెద్దలు, సోడాలిటీ సభ్యులు, మరియ దళ సభ్యులు, కథోలిక క్రైస్తవులు పాల్గొన్నారు.



దివ్యపూజాబలి నిర్వహిస్తున్న జిల్లా మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య

గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌వో దేవప్రభాకర్, ముసుగులో ఉన్న వ్యక్తులు నిందితులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. లాలాపేట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ పి.దేవప్రభాకర్, ఎస్సై ఎం.సుబ్బారావు సోమవారం వివరాలను మీడియాకు వెల్లడించారు. నల్లచెరువుకు చెందిన షేక్ కరిముల్లా, నిమ్మలపేటకు చెందిన చల్లా ఈశ్వరరావు, అదే ప్రాంతానికి చెందిన బత్తుల శ్రావణ్‌కుమార్‌లు లాలాపేటలోని పీకలవాగు కట్ట డంపింగ్ యార్డు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చెడు వ్యసనాలకు బానిసలుగా మారి సులభతరంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో భద్రాచలం, ఒడిశా, ప్రాంతాల నుంచి గంజాయి తీసుకు వచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ కేసులో మరికొంత మంది నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందుతులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్ రవి, శంకర్, కిరణ్‌లను ఎస్‌హెచ్‌వో దేవప్రభాకర్ అభినందించారు.

నిందితుడి అరెస్ట్

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడుకు చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదం చేసి కోర్టుకు హాజరు కాకపోవడంతో సోమవారం మంగళగిరి పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. మంగళగిరి రూరల్ ఎస్ఐ సి.హెచ్. వెంకటేశ్వర్లు కథనం ప్రకారం రేవేంద్రపాడుకరకట్ట మీద మెల్లెంపూడి సమీపంలో మంగళగిరి రూరల్ పరిధి పెదవడ్లపూడి ప్రాంతంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టాడు. ఈ క్రమంలో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అప్పట్లో ప్రమాదానికి కారణమైన కొప్పుల రమేష్‌ను అరెస్ట్ చేశామని, అప్పటి నుండి కోర్టుకు హాజరు కాకపోవడంతో కోర్టు అరెస్ట్ వారెంట్ ఇచ్చిందని, సురేష్‌ను పెదవడ్లపూడి వద్ద అదుపులోకి తీసుకుని మంగళగిరి కోర్టుకు హాజరు పరచగా నిందుతుడు సురేష్‌కు ఏడు రోజుల రిమాండ్ విధించారని ఆయన తెలిపారు.